

నిరవధిక ధర్నాలో పాల్గొంటున్నాం

ఆశావర్కర్ల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం కలెక్టరేట్ వద్ద డిసెంబర్ 14 ,15 తేదీల్లో జరిగే నిరవధిక ధర్నాలో పాల్గొంటున్నామని, ఆ రెండు రోజులు విధులకు హాజరు కాలేమని తెలియజేస్తూ విజయనగరం రాజీవ్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ తాలారి సుష్మ సాయికి ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని ,మొబైల్ వర్క్స్ శిక్షణ ఇవ్వాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో వెంకటలక్ష్మి, అషాభాను, సుజాత, లీల, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నష్టం అంచనాకు నిబంధనాలు

- నష్టం 33 శాతం దాటితేనే పరిహారం
- 5ఎకరాలలోపు రైతులకే వర్తింపు
- ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి
- పంటనష్ట గణనకు ఎట్టకేలకు మార్గదర్శకాలు

విజయనగరం మండలం చిల్లపేటలో నీటమునిగిన వరిచేను ఆరబెట్టేందుకు తీసుకెళ్తున్న రైతు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపు విషయంలో ప్రభుత్వ నిబంధనలు గుదిబండగా మారాయి. 5ఎకరాల లోపు గల రైతులకు మాత్రమే నష్టపరిహారం ఇస్తామని మెలికపెట్టింది. ఇందులోనూ ఎకరా విస్తీర్ణంలో 33శాతం నష్టం జరిగితేనే పరిహారానికి ఎంపిక చేయాలని మరో నిబంధన పెట్టారు. ఆ పంట కూడా ఇ-క్రాప్‌లో నమోదై ఉంటేనే పరిగణలోకి తీసుకుంటారట. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఎజిసి02-26025 పేరిట ప్రత్యేక ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిబంధనల ప్రకారం చాలా మంది రైతులకు నష్టపరిహారం అందే పరిస్థితి లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మిచౌంగ్ తుపాను కారణంగా ఈనెల 4 నుంచి నుంచి 6వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాల్లో వివిధ పంటనష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోసిన పంట పొలాల్లోనే నీట మునిగిపోయింది. వరి దిబ్బలు కూడా సుమారు నాలుగు రోజులపాటు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. కోతలు పూర్తికాని చోట చాలా వరకు వరి చేను నేలకు ఒరిగిపోవడం, నీటిలో మునిగిపోవడం, మట్టి, ఇసుక మేటలకు గురికావడం వంటి రూపాల్లో నష్టపోయారు. కోసిన వరి పంటకు పరిహారం చెల్లించే ప్రశక్తే లేదని ఇటీవల సాక్షాత్తు రాష్ట్ర మంత్రులే స్పష్టం చేశారు. దీంతో, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మునిగిపోయిన, నేలకొరిగిన, ఇసుక మేటకు గురైన చేనుకు మాత్రమే పరిహారం చెల్లించేందుకు అనుగుణంగా మాత్రమే ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. కోసిన పంటలో రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతోంది.

వాస్తవానికి రాష్ట్రంలో ఈనెల మొదటి వారంలోనే ఎక్కువగా వరి కోతలు అయ్యాయి. వీటిలోను ఎక్కువ భాగం పొలాల్లోనే ఉండిపోయాయి. ఈలోపు వచ్చిన తుపాను రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. విజయనగరం జిల్లాలో 2.40లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా 1.60లక్షల ఎకరాల్లో తుపాను ముందు రోజునాటికి కోతలు పూర్తయ్యాయి. ఇందులో దాదాపు లక్ష ఎకరాల్లో వరి చేను పొలాల్లోనే ఉండిపోయింది. వావులన్నీ వర్షపునీటిలో తేలియాడాయి. వరి దిబ్బలైతే మొకాళ్ల లోతులో మునిగిపోయాయి. ఇప్పటికీ అక్కడకక్కడా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. రెండు రోజులుగా వరి దిబ్బలను ఇరగదీసి ఆరబెట్టేందుకు ప్రయత్నిస్తున్న రైతులు. ధాన్యం ముక్కుపోవడం, రంగుమారిపోవడం, మొలకెత్తడం వంటి పరిస్థితులను చవి చూస్తున్నారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. వీటిని కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ గత అనుభవాల దృష్ట్యా న్యాయం జరిగే పరిస్థితి లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇక కొతకోయకుండా మిగిలిన పంట నష్టాన్ని మాత్రమే ప్రభుత్వం గుర్తించనుంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది సంయుక్తంగా పంటనష్టాన్ని గుర్తించాలని ప్రభుత్వ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకోసం గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో ప్రత్యేక బృందాలను కలెక్టర్ ఆధ్వర్యాన తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈనెల 18వ తేదీ నాటికి నష్టగణన పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ఆ తేదీనాటికి తయారు చేసిన రైతుల జాబితాను సామాజిక ఆడిట్ కోసం ఆర్‌బికెల్లో ప్రదర్శనకు పెట్టనున్నారు. 22వ తేదీ వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. వీటన్నింటినీ పరిష్కరించి 26వ తేదీన నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కలెక్టర్ ఆధ్వర్యాన ప్రభుత్వానికి ప్రభుత్వానికి పంపాల్సి వుంటుంది. వీటిని పంపడానికి ముందు విస్తీర్ణం, జరిగిన నష్టం, ఇ-క్రాప్ నమోదు తదితర అంశాలను పున:పరిశీలించాలని కూడా స్పష్టం చేసింది.

జగనన్నకు చెబుదాంకు 198 వినతులు

రెవెన్యూ అధికారుల అక్రమాలపై వృద్ధురాలు నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత, డిప్యూటీ కలెక్టర్ డి. వెంకటేశ్వర రావు, బి.సుదర్శన దొర, కె.ఆర్.ఆర్.సి. డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కారం కోసం పంపించారు. మొత్తం 198 వినతులు అందగా వీటిలో అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 138 ఉన్నాయి.

వృద్ధురాలు నిరసన

ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సారిపల్లి రమణమ్మ రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసు పుస్తకాల కోసం లంచాలు అడుగుతున్నారంటూ స్పందనలో ప్లకార్డు పట్టుకొని నిరసన తెలిపింది. విఆర్‌ఒ అప్పలరాం, ఆర్‌ఐ, తహశీల్దార్ లంచం ఇవ్వకపోతే ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపింది. తన భర్త అప్పలనాయుడు, ఆయన సోదరుడు సూరిబాబు భూములకు సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు 2020లో ఇచ్చినా 1బి మాత్రం సూరిబాబు పేరున ఇచ్చారని, తమ పేరున ఇవ్వాలని అడిగితే టేకు చెట్లు లంచంగా విఆర్‌ఒ అడిగారని, ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపింది. ఆర్‌డిఒకు గతంలో ఫిర్యాదు చేస్తే 1బి ఇచ్చేయాలని చెప్పినా ఇవ్వడం లేదని ఆవేదన చెందింది.

రెవెన్యూ అధికారుల అవినీతిపై ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న మహిళ

ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్లు వేగంగా చేయాలి

స్పందన అనంతరం సంయుక్త కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 15 నుండి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉన్నందున మండల ప్రత్యేకాధికారులు వారికి ఇచ్చిన లక్ష్యాలను తప్పక నెరవేర్చాలని సూచించారు. ఈ విషయం లో వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

సమస్యను వివరిస్తున్న టిడిపి నాయకులు

ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయాలి

విజయనగరం విజ్జి స్టేడియంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని నియోజకవర్గ టిడిపి నాయకులు అధికారులను కోరారు. తుపాను వలన పంటను నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని , తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతినిచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగ్ రావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కనకల మురళీమోహన్, కె.శ్రీనివాసరావు, ఇతర నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

16 వరకూ వ్యాక్సినేషన్ డ్రైవ్

- 27 నుండి జనవరి 12 వరకు లెప్రసీ కేసుల గుర్తింపు
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

మిషన్ ఇంద్ర ధనుష్ కింద ఈ నెల 11 నుండి 16 వరకూ వాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. స్పందన అనంతరం అధికారులతో జెసి మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలకు న్యుమోనియా, పోలియో, బి.సి.జి, హెపటైటిస్ బి, రోటావైరస్ తదితర వాక్సిన్లు వేస్తారని తెలిపారు. గర్భిణులకు అవసరమైన వారికీ టేటానాస్ ఇంజక్షన్ కూడా వేయించాలని , ఈ విషయమై ఐ.సి.డి.ఎస్. వైద్య శాఖ, అంగన్వాడీ శాఖలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. జిల్లాలో ఈ నెల 27 నుండి జనవరి 12 వరకు లెప్రసీ కేసుల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని జెసి తెలిపారు. శరీరంపై ఎక్కడైనా స్పర్శ లేని మచ్చలు ఉంటె అటువంటి వారిని గుర్తించి దగ్గర లోనున్న ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్ళాలని తెలిపారు. పాఠశాల పిల్లలకు కూడా తనిఖీలు చేయాలని, డిఇఒ ద్వారా స్పర్శ తెలియని పిల్లల్ని గుర్తించాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు, ఆశ, అంగన్వాడీ , వాలంటీర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలిపారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్. భాస్కర రావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీ శంకర్‌రావు, డిఐఒ డాక్టర్ అచ్చుత కుమారి, లెప్రసీ వైద్యులు కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమం మరిస్తే బుద్ధిచెబుతాం

ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు, దళితులు, డప్పు కళాకారులు

కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దళితుల సంక్షేమ పథకాల అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో దళితులంతా ఏకమై ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, గౌరవాధ్యక్షులు ఆర్. రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలని, ఎస్‌సి కార్పొరేషన్ 29 రకాల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని, డప్పు కళాకారుల, చర్మ కారుల పింఛన్ ఐదు వేల రూపాయలకు పెంచాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెత్తందారులు అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే పట్టాలు మంజూరు చేస్తున్న ప్రభుత్వం ఏళ్ల తరబడి దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాల మంజూరు చేయకపోవడం హేయమైన చర్యని అన్నారు. ప్రతి మండలంలోనూ దళితుల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు భూ రీ సర్వే పేరుతో పేదల సాగు భూములకు పట్టాల మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో అమలకు నోచుకోవడం లేదన్నారు. స్వయం ఉపాధికి ఉపయోగపడే ఎస్‌సి కార్పొరేషన్ సంక్షేమ పథకాలను కూడా ఈ ప్రభుత్వం రద్దు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ బాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, దళితులపై జరిగే దాడులను అరికట్టాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ధర్నాలో అప్పారావు, డప్పు కళాకారులు,దళితులు పాల్గొన్నారు

సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి

13న వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్

ప్రజాశక్తి-విజయనగరం

సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 13 న వాకిన్ రిక్రూట్మెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.పద్మలీల ఒక ప్రకటనలో తెలిపారు. గాజులరేగ సమీపంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే ఈ 6 వ విడత వాకిన్ రిక్రూట్మెంట్ కు అభ్యర్థులు దరఖాస్తుతో బాటు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లను కూడా తీసుకురావాలని తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాల కోసం http://vizianagaram.ap.gov.in లేదా http;//vizianagaram.nic.in సంప్రదించాలని ప్రిన్సిపల్ సూచించారు.

నేడు జిల్లాలో పిఐబి ఎడిజి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలోని పత్రికా సమాచార బ్యూరో (పి.ఐ.బి)కి అదనపు డైరెక్టర్ జనరల్ ధీరజ్ కకాడియా మంగళవారం జిల్లాలో పర్యటిస్తారు. జిల్లాలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అధికారి 12న ఉదయం 10 గంటలకు గంట్యాడ మండలం తాటిపూడి గ్రామ పంచాయతీలో, మధ్యాహ్నం 2 గంటలకు డెంకాడ మండలం డి.తాళ్లవలసలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నోడల్ అధికారి బి.తారక ప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని ఐటిఐ కాలనీ వద్ద ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసు కున్నారు. 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురి తమైన 'ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా' కథనానికి తహశీల్దార్ డోల రాజేశ్వ రరావు స్పందించారు. ఆక్ర మణకు గురైన స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, విఆర్‌ఒలతో కలిసి పరిశీలించారు. జగనన్న కాలనీ రిజర్వ్ స్థలంగా గుర్తించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన స్థలంలో బోర్డు పెట్టి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే శిక్షార్హులని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, భూములను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తహశీల్దార్ వెల్లడించారు.

ఆక్రమిత స్థలంలో బోర్డు ఏర్పాటుచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది

బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

బాక్సింగ్ పోటీలు ప్రారంభం

900 మంది క్రీడాకారులు హాజరు

ప్రజాశకి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అండర్ 14,17,19 విభాగాల్లో బాక్సింగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉన్న బాక్సింగ్ కోర్టులో పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా పోటీలు శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయని అన్నారు. మూడు విభాగాల్లో రాష్ట్ర పోటీలు జిల్లా కేంద్రంలో జరగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి వాసుదేవరావు, ఎస్‌జి ఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.మన్మధరావు, వైసిపి నగర అధ్యక్షులు ఎ.వేణు,కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు రాష్ట్ర వ్యాప్తంగా 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

దారి దీపం గురజాడ

ఇది ఒక చారిత్రాత్మక ప్రదేశం : సినీనటుడు ఎల్‌బి శ్రీరాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గురజాడ అప్పారావు ఎందరికో దారి దీపం (లైట్ హౌస్)అని ప్రముఖ రంగస్థల, సినీ రచయిత, నటులు ఎల్.బి.శ్రీరాం కొనియాడారు. నవ సాహితీ సంస్థ ఇస్తున్న అవార్డు అందుకునేందుకు విశాఖ వచ్చిన ఆయన ఈ సందర్భంగా సోమవారం విజయనగరంలోని గురజాడ స్వగృహాన్ని సందర్శించారు. గురజాడ తిరిగాడిన ప్రదేశాన్ని, రచనలు, వాడిన వస్తువులను చూసి పులకించి పోయారు. గురజాడ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు, గురజాడ వారసులు ముందుగా ఎల్‌బి శ్రీరాంకు శాలువా కప్పి సన్మానించి, కన్యాశుల్కం పుస్తకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం అందుకోవడం కోటి రూపాయలు కంటే ఎక్కువని, ఆది నాటకంగా పిలవబడుతున్న కన్యాశుల్కం నాటకం సృష్టి కర్త మహనీయుడు గురజాడ అప్పారావు స్వగహాన్ని సందర్శించడం అదృష్టమని అన్నారు. ఆయన పరిచిన బాటలోనే అందరూ నడుస్తున్నారన్నారు. ఆయన పంథా తనకు అబ్బి జనరంజకంగా సినిమాల్లో రాస్తున్నట్లు తెలిపారు. అందువలనే 40మంది కమీడియన్స్‌లో తాను ఒక్కడిని కాగలిగాను అన్నారు. విలువలు, సాంప్రదాయాలు పునుకుపుచ్చుకున్న వారిలో నేను ఒకరని అన్నారు. అలనాటి నటి సావిత్రి లాంటి వారితో మధురవాణి పాత్ర తీసుకురావడం, అలాగే ఆయన వారసత్వాన్ని ఇంకా సమాజంలో కొనసాగించుకోగలుగుతామని తెలిపారు గురజాడపై త్వరలోనే ఒక లఘు చిత్రాన్ని ఇక్కడికి వచ్చి చేస్తానని అన్నారు. నేటి సినీ రంగంలో కొత్తదనాన్ని తీసుకురావాలని, దానితోపాటు పాతను తీసుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నటులు ఉష్ కాకి అప్పారావు, తిరుపతి నాయుడు , గురుజాడ సాంస్కతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, గురజాడ వారుసులు గురజాడ వెంకట ప్రసాద్, ఇందిరా, సభ్యులు సూర్యలక్ష్మి, ఈపు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గురజాడ వినియోగించిన వస్తువులను పరిశీలిస్తున్న ఎల్‌బి శ్రీరాం

జీతాలు, హెల్త్ అలవెన్సులు

చెల్లించకపోతే బతికేదెలా?

డిఆర్‌ఒకు సిఐటియు వినతి

ప్రప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముషిడిపల్లి, రామతీర్థం నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు 3 నెలల బకాయి జీతాలు, పారిశుధ్య కార్మికులకు 3 నెలల బకాయి హెల్త్ అలవెన్సులు తక్షణమే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒ అనితకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం యూనియన్ జిల్లా బాధ్యులు ఎ.జగన్ మోహన్ రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. సుధారాణి, నాయకులు చంద్రరావు, రాఘవ, అర్జున్, లక్ష్మణరావు తదితరులు మాట్లాడారు. విజయనగరం పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందిస్తున్న పంపు హౌస్ కార్మికులకు గత 3 నెలలుగా జీతాలు , పారిశుధ్య కార్మికులకు 3 నెలల హెల్త్ అలవెన్సులు బకాయిలు ఉన్నాయని , జీతాలు, హెల్త్ అలవెన్సులు ప్రతినెలా చెల్లించకపోతే బతకడం ఎలా అని ప్రశ్నించారు. తక్షణమే చెల్లించకపోతే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడును కలిసి సమస్యను వివరించారు. కమిషనర్ స్పందించి డిఇ అప్పారావుతో మాట్లాడి జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

యువగళం పాదయాత్ర ముగింపు సభకు

పోలిపల్లి వద్ద భూమిపూజ

ప్రజాశక్తి - భోగాపురం

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభకు మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలోగల భూమాత లేఅవుట్‌లో సోమవారం భూమి పూజ చేశారు. ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు ఈ సభను నిర్వహించాలని నిర్ణయించారు. టిడిపి నియోజవర్గం ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర టిడిపి నాయకులతో పాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడు భూమి పూజ చేశారు. సుమారు 5లక్షల మంది హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో ఈ స్థలం అనువుగా ఉంటుందని పార్టీ పెద్దలు నిర్ణయించారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాన్‌తో పాటు చంద్రబాబు నాయుడు, నందమూరి బాలకృష్ణ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. దీంతో సభకు సంబంధించిన ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేయాలని నిర్ణయించారు. ఆ పార్టీ నాయకులు పి. ఆశోక్ గజపతిరాజు, కిమిడి కళా వెంకటరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కోరాడ రాజబాబు, కూన రవికుమార్, పతివాడ నారాయణస్వామి నాయుడు, కొండపల్లి అప్పలనాయుడు, కోండ్రు మురళీ, కిమిడి నాగార్జున, కర్రోతు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

తరలిన టిడిపి శ్రేణులు

విజయనగరం కోట : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఉత్తరాంధ్ర లో ప్రవేశించిన సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం వద్ద స్వాగతం పలికేందుకు నియోజకవర్గ ఇంచార్జ్ అదితి గజపతి రాజు నాయకత్వంలో సోమవారం పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

59 మందికి లా నేస్తం విడుదల

విజయనగరం : జిల్లాలోని 59 మంది యువ న్యాయవాదులకు వైయస్సార్ లా నేస్తం విడుదలైంది. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి లా నేస్తాన్ని న్యాయవాదుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. నెలకు రూ.5వేలు చొప్పున ఆరు నెలలకు సంబంధించి రూ.30వేలు మొత్తాన్ని ఒక్కొక్కరికి విడుదల చేశారు. ఈ ఏడాది జూలై, ఆగస్ట్ నెలలకు 59 మందికి, సెప్టెంబర్ నెలకు 57 మందికి, అక్టోబర్ నెలకు 58 మందికి, నవంబర్ నెలకు 57 మందికి విడుదల చేశారు. ఈ 59 మందిలో బిసిలు 39 మంది, ఒసిలు 9, ఎస్సీలు 10, ఎస్టీ ఒక్కరు ఉన్నారు. జిల్లా నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, కలెక్టరేట్ ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ గొట్టాపు రాము, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జెసి అశోక్, న్యాయవాదులు

సుందరీకరణకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర సుందరీకరణకు విఘాతం కలిగించే వారి పట్ల చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములు నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు 61వ సచివాలయ పరిధిలో ఉన్న ప్రణాళికా కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి, ప్రయాసకోర్చి సుందరీకరణ పనులను చేపట్టామని అన్నారు. ఈ నేపథ్యంలో సుందరీకరణకు విఘాతం కలిగించే వారి పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై అపరాధ రుసుముగా రూ.10వేలు విధిస్తామని తెలిపారు. మార్జిన్ లైన్లు అతిక్రమించి తోపుడుబల్లతో గాని ఇతర చిరువ్యాపారులు గాని వ్యాపారాలు సాగించినట్లయితే మందలించడంతోపాటు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏసీపీ మధుసూదన రావు,టీపీఎస్ ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన

విజయనగరం కోట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చినట్లు ప్రిన్సిపల్ టివి.గిరి తెలిపారు. 125 మంది హాజరైనట్లు చెప్పారు. ఇఐడి ప్యారీ షుగర్స్, కేశవ జ్యూట్ మిల్స్, శిరిడి సాయి ఎలక్ట్రికల్స్, శామ్సంగ్ సర్వీస్ సెంటర్, మైలాన్ లోటరీజి, జయభేరి ఆటోమొబైల్స్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జి.రామాచారి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

16, 17న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

శృంగవరపుకోట : ఈనెల 16, 17 తేదీల్లో నెల్లిమర్లలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు కోరారు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

గంట్యాడ :మండలంలోని పెదమజ్జిపాలెం పిహెచ్‌సిలో 60 మంది గర్భిణులకు వైద్యులు పల్లవి సోమవారం పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. పలు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వి లక్ష్మి, హెచ్ఎస్ తిరుపతి, పిహెచ్ఎన్ అమ్మనకొండ, ఆరోగ్య సహాయకులు ఈశ్వరరావు పాల్గొన్నారు.

కందిపప్పు సరఫరా చేయాలి

శృంగవరపుకోట : రేషన్ డిపోల ద్వారా కార్డుదారులందరికీ కందిపప్పు సరఫరా చేయాలని ఆమ్‌ఆద్మీ నియోజకవర్గ కన్వీనర్ పూసపాటి ప్రతాప్ వర్మ సోమవారం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

రహదారి ఆక్రమణపై ఫిర్యాదు

తెర్లాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. చింతల వెంకటేష్ అనే వ్యక్తి రహదారిని ఆక్రమించి, తోవలేకుండా చేశారని రంగప్పవలస సర్పంచ్ ఎస్.రాంబాబు ఆధ్వర్యాన గ్రామస్తులు వినతి అందించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు ఎంపిడిఒ సూచించారు.

రాష్ట్ర స్థాయికి హాషిత కోమల్, పూర్వీక

ప్రజాశక్తి-విజయనగరం కోట

భగవద్గీత శ్లోకాలు వల్లె వేయడంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎల్.హాషిత కోమల్, జి.పూర్వీక ఎంపికయ్యారు. 5వ బెటాలియన్ మెయిన్ గేటు ఎదురుగా ఉన్న వాణి సంతోష్ హైస్కూల్ విద్యార్థులు చిన్మయి మిషన్ నిర్వహించిన పోటీల్లో ఎల్ కె జి విద్యార్థిని జి.పూర్వీక 8 శ్లోకాలు, 1వ తరగతి విద్యార్థి ఎల్. హాషిత కోమల్ భగవద్గీత 4వ అధ్యాయంలో ఉన్న 14 శ్లోకాలు వల్లె వేయడంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో శ్రీ శ్రీఅద్య ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 17న ఒంగోలులో జరుగుతాయని మిషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వాణి సంతోష్ హైస్కూల్ ప్రిన్సిపల్ కె.సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హాషిత కోమల్, పూర్వీక

పాఠశాలల సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతోపాటు ఆరిపాక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు సోమవారం పరిశీలించారు. విద్యార్థులు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, నోట్, వర్క్ బుక్స్, తెలుగు, ఇంగ్లీష్ రీడింగ్, చతుర్విధ ప్రక్రియలను పరిశీలించారు.

సీతం ఆధ్వర్యంలో ర్యాలీ

విజయనగరం : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాల సమగ్రాభివృద్ధి లక్ష్యంలో భాగంగా 'వయోవృద్ధులను గౌరవిద్దాం' అనే అంశంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వృద్ధులను గౌరవించాలని, వారు మనకున్న జ్ఞాన సంపదని, ప్రతి ఒక్కరూ వారిని మంచిగా చూసుకోవడం మన కర్తవ్యం అని అన్నారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ వృద్ధులు ఎదుర్కొనే వివిధ రకాల వేధింపులను గుర్తించడం, పరిష్కరించడం ప్రాముఖ్యతను గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'లో ఎంవిజిఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి- డెంకాడ

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం ప్రారంభించిన 'వికసిత్ భారత్ ఎ2047' ఐడియాస్ పోర్టల్ కార్యక్రమంలో స్థానిక ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు వర్చువల్‌గా పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన వందేళ్లయిన 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని భారతదేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. వికసిత్ భారత్ విజన్ ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, సుపరిపాలనలతో సహా అభివృద్ధి వివిధ అంశాలను కలిగి ఉంటుందని వర్చువల్ సమావేశం తరువాత ఎంవిజిఆర్ డైరెక్టర్ పి.సీతారామరాజు తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమేష్, డీన్ ఎన్.జె.మోహన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో సత్తాచాటిన దేవి

ప్రజాశక్తి-బాడంగి

బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కోట దేవి వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో సత్తాచాటింది. బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యాన ఇటీవల బాల్యవివాహాలపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ముగడ గ్రామానికి చెందిన కోట దేవి... వక్తృత్వ పోటీల్లో ప్రథమ, వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. దీంతో నిర్వాహకులు ఆమెకు బంగారు, రజత పతకాలతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. దేవిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కొత్తవలస : మండలంలోని పంచాయతీలకు ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎంపిడిఒ వై.పద్మజ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పిఇటిలు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బొబ్బిలి : టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్ జన్మదినం సందర్భంగా సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జి.శశిభూషణరావు, నంది రఘు, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సోమవారం సతివాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం, డి పట్టా భూములకు శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్న డి పట్టా భూములకు శాశ్వత భూహక్కులు కల్పించి పత్రాలు ఇస్తున్నామన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నియోజక వర్గ స్థాయిలో 258 మంది వికలాంగులకు అనుకరణ పరికరాలు, ట్రై సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీ రాములు నాయుడు, నగర పంచాయతీ చైర్మన్ బంగారు సరోజినీ, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ జమ్ము అప్పల నాయుడు, తహశీల్దార్ డి. ధర్మ రాజు, ఎంపిడిఒ జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నాయకులు లేకుండానే 'వై నీడ్ జగన్'

నగర పంచాయతీలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షులు, జెసిఎస్ కన్వీనర్లు, కౌన్సిలర్లు, ఇతర నాయకులు లేకుండానే నిర్వహించారు. సోమవారం నగర పంచాయతీ 3 వార్డు సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్, వైస్ ఛైర్మన్, అధికార్లు తప్ప పార్టీ అధ్యక్షులు, జె సిఎస్ కన్వీనర్లు, కౌన్సిలర్లు సైతం హాజరు కాకుండా జెండా ఆవిష్కరణ జరిపి మమ అనిపించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పార్టీ మీద, అధికార్ల తీరు మీద గుర్రుగా ఉన్న నేతలు వై నీడ్ ఎపి జగన్ కార్యక్రమానికి చెప్పక పోవడం మరింత ఆగ్రహంతో రగిలి పోతున్నారు. ప్రస్తుతం అధికార పార్టీ మీద అన్ని వర్గాల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా వై నీడ్ ఎపి జగన్ కార్యక్రమానికి సమాచారం ఇవ్వక పోవడం పార్టీ అధ్యక్షులు, జెసిఎస్ కన్వీనర్లు, కౌన్సిలర్లు మరింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఫైబర్‌నెట్ ఆపరేటర్ల సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

ప్రభుత్వం ఎపిఎస్ఎఫ్ఎలు నిర్వీర్యం చేసే దిశగా ఆపరేటర్లను సమస్యలలోకి నెడుతోందని దీనిపై తక్షణమే అధికారులు, నాయకులు స్పందించాలని రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు నారాయణరావు అన్నారు. సోమవారం స్థానిక రాజవీధిలో ఎపిఎస్ఎఫ్ఎల్ ఆపరేటర్లు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేదవారికి ఇంటర్నెట్, టీవీ ఛానెల్లు అందుబాటులో దొరికే విధంగా దీనిని ప్రారంభించిందన్నారు. దీనిపై నేటి ప్రభుత్వం అశ్రద్ధ కనబరచటంతో ఇటు వినియోగదారులు, ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 9 లక్షల కనెక్షన్ల నుండి నేడు సుమారు 6లక్షల కనెక్షన్లకు ఇది పడిపోయిందన్నారు. వినియోగదారుడు వినియోగించుకున్న దానికి సంబంధించి ఆపరేటర్ల వద్ద 58 రూపాయలను బలవంతంగా ప్రభుత్వం తీసుకొంటోందన్నారు. కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు దీనికి సంబంధించిన బాక్సులను ప్రభుత్వం అందజేయటంలేదని, పాడైన బాక్సులను మరమ్మత్తులు చేసేందుకు సర్వీస్ సెంటర్లు ప్రభుత్వం ఏర్పాటు చేయటం లేదని అన్నారు. దీంతో వినియోగదారులు నానాటికి తగ్గిపోయి ఆపరేటర్ల బతుకులు ఛిద్రంగా మారుతున్నాయన్నారు. దీనిపై రాష్ట్ర నాయకుల వద్ద ప్రస్తావిస్తే సమస్యలు పరిష్కరిస్తామని తెలపటమేగాని, పరిష్కారం జరగటంలేదని తెలిపారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు కూడా వినతి పత్రాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు మండలంలో గల కేబుల్ ఆపరేటర్లు, జెఎసి నాయకులు పాల్గొన్నారు.

ఇవిఎంపై అవగాహన ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఇవిఎం ద్వారా ఓటు వేయడంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్‌డిఒ సాయిశ్రీ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇవిఎంలపై అవగాహన కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కేంద్రం తెరిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, సిఎస్ డిటి సాయికృష్ణ, ఎన్నికల డిటి గౌరీశంకర్రావు పాల్గొన్నారు.

మెంటాడ : ఇవిఎంల వినియోగంపై తహశీల్దార్ కార్యాలయం వద్ద ట్రెయినీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారంలో గ్రామాల్లో పర్యటించి ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో భూసమస్యలు, ఇతరత్రా సమస్యలపై తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.రామకృష్ణ, విఆర్ఒ రెడ్డి అప్పలనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు.

అవగాహన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

రేషన్ పంపిణీలో అక్రమాలను నివారించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎండియు ఆపరేటర్లు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు తెలిపారు. రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సోమవారం ఎండియు వాహనం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దకు రేషన్ సరుకులను అందిస్తామని ప్రభుత్వం ఎండియు ఆపరేటర్లను నియమించినా సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదన్నారు. కంది పప్పు ప్రజలకు సక్రమంగా ఇవ్వకుండా, నల్లబజారుకు తరలించి అమ్ముకుంటున్నారని చెప్పారు.

5, 6, 7 వార్డులకు ఆరు నెలల నుంచి రేషన్ కందిపప్పు ఇవ్వడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్ణవేణి, రమణమ్మ పాల్గొన్నారు.

పేదలకు వస్త్రదానం

ప్రజాశక్తి - జామి

జామిలోని బసవేశ్వర ఆలయంలో బసవేశ్వర స్వామి గనారాధన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పేదలకు భారీ వస్త్ర, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో సూర్యనారాయణ రాజు, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవి, జెడ్‌పిటిసి గొర్లె సరయు, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లుపద్మ, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు.. తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావును ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు తన మద్దతు ఉన్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తనతోపాటు సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడు పేరు చెప్పి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణలు గుర్తించి తొలగించి, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు.

9 మంది వైద్యుల నియామకం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఎన్ఆర్‌సిలో 9 మంది వైద్యులను నియమించారు. ఈ పోస్టుల భర్తీకి సోమవారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వారు కోరుకున్న చోట పోస్టింగులు ఇచ్చారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రజావేదిక స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం జరిగింది. ఈ ప్రజావేదికలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమా పరమేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ డిఆర్‌పిలు గ్రామాల్లో జరిగిన పనుల్లోని లోటు పాట్లును గుర్తించి నివేదికలు ఇచ్చారు. వీటిపై పీడీ ప్రజావేదికలో సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. ఉపాధి పనుల్లో కూలీలందరికి పూర్తి స్థాయిలో పనులు కల్పించాలన్నారు. మండలంలో ఎటువంటి అక్రమాలు జరగవనే నమ్మకంతో రాష్ట్ర, కేంద్ర స్థాయి నుంచి వచ్చిన బృందాలకు ఇక్కడకు పంపిస్తుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఎపిడి జనార్దనరావు, ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి, ఎపిడి లక్ష్మణరావు, ఎస్ఆర్‌పి అచ్యుతరావు, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, భాను ప్రకాశ్, ఎపిఒ ఆదిబాబు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి- రేగిడి

ఇల్లు నిర్మించిన గృహలబ్ధిదారులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని హౌసింగ్ ఈఈ రత్నాకర్ తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నాలుగు దశల్లో నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు విడతల వారీగా జియో ట్యాగింగ్ చేసి బిల్లులు చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకే ఇల్లు బిల్లు చెల్లించాలని సూచించారు. పాత ఇల్లులకు బిల్లులు చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేంద్ర గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. స్లాబులు వేసిన ఇళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లులు చెల్లిస్తే చర్యలు తప్పవన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ఈఈతో పాటు ఎంపిడిఒ శ్యామల కుమారి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ, సిఏ రామినాయుడు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని శివారు ప్రాంతాలలో సైతం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఒకటో డివిజన్ నందిగుడ్డి ప్రాంతంలో రాజవీధి, హనుమాన్ నగర్‌లో రూ.6.80 లక్షలతో ఏర్పాటు చేయనున్న సిసి రహదారులకు, డ్రైన్‌లకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సమస్యలేని నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఒకవైపు మౌలిక సదుపాయాలు కల్పించడం, మరోవైపు ప్రజా అవసరాలను గుర్తించి తాగునీరు సరఫరా చేయడం వంటి అనేక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏ ప్రాంతం చూసినా సంపూర్ణ మౌలిక సదుపాయాలతో ప్రజలు నివసించేందుకు అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి ముచ్చు శ్రీనివాసరావు, డివిజన్ ఇంచార్జి దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పిపిఎస్ఎస్ నాయకులు, అయ్యప్పనగర్ వాసులు

అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చేయాలి

గాంధీ విగ్రహం వద్ద అయ్యప్పనగర్ వాసుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఒకటవ డివిజన్ పరిధిలోని అయ్యప్పనగర్ లో పూసర్ల మధు సూదనరావు అక్రమంగా నిర్వహిస్తున్న స్వాతీ ప్యూర్‌ఫైడ్ కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు,, అయ్యప్ప నగర్ పోరాట కన్వీనర్ యు ఎస్ రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్లాంట్‌కు భూగర్భజల శాఖ, మున్సిపల్, రెవెన్యూ అధికారులెవరూ అనుమతులు ఇవ్వలేదని, అయినా అక్రమంగా నీటివ్యాపారం చేస్తూ ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారని తెలిపారు. మరోవైపు అయ్యప్ప నగర్‌లో ఇళ్ల బోర్లు ఇంకిపోయి నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని మోసం చేసి అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న యజమాని పూసర్ల మధుసూదన రావును అరెస్ట్ చేయాలని , అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఎల్‌బిజి నగర్ కార్యదర్శి బి. రమణ, రామకృష్ణా నగర్ నుంచి జగన్ మోహన్ , గురజాడ నగర్ తరుపున కార్యదర్శి రంబ శ్రీను, అయ్యప్ప నగర్ కాలనీ అసోసియేషన్స్ కార్యదర్శి సుదీర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది త్రినాథ్ ఆయా సంఘాలు, కాలనీల తరుపున వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం, సిఐటియు నాయకులు టివి రమణ, సుధారాణి పాల్గొన్నారు.

ప్రణాళికతో విజయం సాధ్యం

ప్రజాశక్తి- డెంకాడ

సరైన ప్రణాళికతోనే విజయం సాధ్యమవుతోందని విజిలెన్స్ అధికారి (ఆర్ఐఎన్ఎల్) డాక్టర్ ఎస్. కరుణ రాజు అన్నారు. లెండి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కోసం 'కెరీర్ గైడెన్స్ ఏవే అఫ్ లైఫ్' అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ పురోగతి, నిర్మాణంలో భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. అందుకు లక్ష్య సాధన కోసం శ్రమించడం తప్పితే వేరే మార్గాలు ఉండవన్నారు. చదువు ఆరంభంలోనే కెరీర్‌ని సరిగా ప్లాన్ చేసుకోకపోతే తర్వాత స్పష్టత లేని గందరగోళ జీవితం సవాలు విసురుతుందన్నారు. విద్యార్థులతో చర్చా గోష్ఠి నిర్వహించి, విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసి విలువైన విజయ సూత్రాలను అందించారు., కర్నూల్ ఐఐటిడిఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటకృష్ణారావు మాట్లాడుతూ యువతలో దాగున్న నైపుణ్యాలను వెలికి తీసి, దేశ నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వ్యక్తిత్వ వికాస కార్యక్రమ నిర్వహణ వల్ల యువతలో స్ఫూర్తి పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పి.మధుసూధనరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తమ్మినేని హరిబాబు, డాక్టర్ పీడీ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

బొండపల్లి : మండలంలోని గరుడబిల్లి, రాచకిండాం ఆర్‌బికెల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పివి.మల్లికార్జున రావు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, రాచకిండాం పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లు సతీష్‌కుమార్, చొక్కాకు నారాయణరావు, పెదమజ్జి గోపి, శిరుపురపు నాయుడుబాబు, లెంక అప్పారావు, గ్రామ కార్యదర్శి ఎర్రినాయుడు, విఎ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎంపిక చేసిన గ్రామాలకే కందిపప్పు

ప్రజాశక్తి-వేపాడ

రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీలో ప్రభుత్వం పక్షపాతం చూపుతోంది. కొన్ని గ్రామాలకు కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేయడమే అందించి, మిగతా గ్రామాల్లో కార్డులను పక్కన పెట్టడమే అందుకు నిదర్శనం. గత నెలలో అన్ని డిపోల ద్వారా గోధుమ పిండి, గోధుమపిండి అందరికీ అందజేశారు. ఈ నెల మాత్రం ప్రభుత్వం కొన్ని గ్రామాలను ఎంపిక చేసి, కందిపప్పు, గోధుమపిండి ఇస్తున్నట్లు సిఎస్ డిటి ఇందిర తెలిపారు. కానీ ఆ గ్రామాల్లోనూ అరకొరగా పంపిణీ చేయడం గమనార్హం. కొంతమందికి ఇచ్చి మిగతా కార్డుదారులకు పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సంగమేశ్వర ఆలయాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని సంగాంలో గల సంగమేశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం ఈ ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఈవో కేశవరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావు, చైర్మన్ నాగరాజు ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకువెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సంగమేశ్వర ఆలయానికి విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి యాత్రికులు భారీగా వస్తున్నారన్నారు. అందుకే ఈ ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శనరావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, ఊగిరి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-వేపాడ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎంపిపి సత్యవంతుడు తెలిపారు. సోమవారం మండలంలోని కొండగంగుపూడి గ్రామంలో నిర్వహించిన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆయన ఆవిష్కరించారు. వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపిపి ముత్యాలమ్మ, సర్పంచ్ బంగారయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పేరుతో చెట్లు తొలగింపు

నేక్ బృంద సందర్శన సాకుతో సమర్థించుకుంటున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుమతి లేకుండా విలువైన టేకు చెట్లతోపాటు తురాయి, కాగు వంటి వృక్షాలను తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై 'ప్రజాశక్తి'లో సోమవారం వచ్చిన కథనానికి స్పందించిన అటవీ శాఖ అధికారులు సోమవారం కళాశాలను సందర్శించి విచారణ చేపట్టారు. జిల్లా అటవీశాఖ అధికారి ఆదేశాల మేరకు కళాశాలను సందర్శించిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవి కుమార్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 43 దుంగలకు కొలతలు తీసుకున్నామని, ఎటువంటి అనుమతులూ లేకుండా చెట్లను నరికివేశారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ కేశవరావును వివరణ కోరగా నేక్ బృందం సందర్శన ఈ నెల 22, 23 తేదీల్లో ఉండటంతో నేలను చదును చేయాలనే ఉద్దేశంతో చెట్లను తొలగించామన్నారు. ముందస్తు అనుమతులు తీసుకోవాలని తనకు తెలియదంటూ కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. పర్యావరణ ప్రేమికుడు, న్యాయవాది బి.రామకృష్ణ మాట్లాడుతూ నేక్ గ్రేడింగ్ ఇవ్వడానికి, సుందరీకరణ, చెట్ల తొలగింపునకు ఎటువంటి సంబంధమూ ఉండదన్నారు. ప్రిన్సిపల్ వివరణ సహేతుకంగా లేదన్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే న్యాయస్థానానికి వెళ్తామని చెప్పారు.

CHANGE OF NAME

I, Under Signed SHAIK KHALEEL S/o Late SHAIK BABJI, aged 50 years, Muslim, residing at D.No.24-3/1-49, Mastan Street, Vizianagaram Town & District. My name was wrongly mentioned in my Passport bearing No. **L2937260** as **SHIEK KHALEEL** instead of **SHAIK KHALEEL**. Shall henceforth I am being called as **SHAIK KHALEEL** for all purposes.

డాక్యుమెంట్ పోయినది

నేను అనగా ఇనుగంటి వెంకట భాగ్యలక్ష్మి W/o వెంకట అప్పారావు డోర్ నెంబర్ 13-58 రామా టాక్స్ క్వాటర్స్ బొబ్బిలి విజయనగరం జిల్లాలో నివసిస్తున్నాను నేను కొన్నటువంటి బొబ్బిలి మండలం బొబ్బిలి మున్సిపాలిటీలో గల దావాల వీధి దాబా ఇల్లు దస్తావేజు నెంబర్ 274/2012 సర్వే నెంబరు 354-2 గల డాక్యుమెంట్ కోట దగ్గర బ్యాంకు పని నిమిత్తం వెళ్లినప్పుడు జెరాక్స్ షాపు పరిసర ప్రాంతాల్లో పోయింది. ఎవరికైనా దొరికినచో పై తెలిసిన చిరునామాకు సంప్రదించి అందజేయగలరు.

ఇనుగంటి అప్పారావు
కాంటాక్ట్ నెంబర్ 9492929992, 8410269999